
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 13 । జనవరి । 2025



సోమశిలలో 70.720 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 70.720 టీఎంసీలు ఉన్నాయి. 2,276 క్యూసెక్కుల వరద వస్తుండగా, డెల్టాకు 2,650, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 200, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.80,520
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,310
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,530
నవర (8 గ్రాములు)	రూ.60,240

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0 /23.0

జిల్లాలో సోమవారం అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉండి, చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 77 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పాడి పంటలతో సంతోషం



కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: జిల్లా ప్రజలకు కలెక్టర్ ఓ ఆనంద్ ఆదివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది పాడి, పంటలు బాగా ఉండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు నింపాలని అభిలాషించారు.

జేసీ కార్తీక్ సంక్రాంతి శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు లభించి ప్రజలందరూ సంపూర్ణ ఆయురోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

కొత్త కాంతులతో శోభిల్లాలి..

- మాజీ మంత్రి కాకాణి



నెల్లూరు (బారకాసు): పల్లె సీమల పండగలు భోగి, సంక్రాంతి, కనుమలతో కొత్త కాంతులతో శోభిల్లాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆదివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పర్వదినాలకు మన సంస్కృతిలో గొప్ప ప్రాముఖ్యత ఉందన్నారు.

భోగభాగ్యాలు కలగాలి..

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



నెల్లూరు (పొగతోట): భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ కోరారు. ఆదివారం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంట భోగభాగ్యాలు కలగాలని, పాడి పంటలు అభి వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

నెల్లూరురూరల్: సంక్రాంతి పండగ సెలవు కావడంతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టరేట్ అధికారులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నిర్మానుష్యంగా ఉన్న తమిదపాడు గ్రామం సెంటర్



కళతప్పిన సంక్రాంతి

సాక్షి విజిట్

సంక్రాంతి అంటేనే పల్లె పండగ. ధనుర్మాసం నుంచి రంగుల రంగవల్లులతో తీర్చిదిద్దే పల్లె ముంగిళ్లు. గుమ్మడి పూల అలంకరణలతో కొలువుదీరే గొబ్బెమ్మలు. హరిదాసుల కీర్తనలు. డూడూ బసవన్నల విన్యాసాలు. పిండి వంటల ఘుమఘుమలు. గాలిపటాలతో పిల్లల కేరింతలు. పొట్టకూటి కోసం వలస వెళ్లిన పల్లె వాసులు తిరిగి రాకలు, ఊరంతా కొత్త అల్లుళ్లు.. బంధు మిత్రుల సందళ్లు. ఇంటికి చేరే ధాన్య రాశులతో అన్నదాతల ఆనందోత్సాహాలు. పల్లె ముంగిట గిలిగింతలు పెట్టే చలి మంటలు.. ఇదంతా గతం.

ఇలాంటి సంక్రాంతుల సందళ్లు ఈ ఏడు పల్లెల్లో కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె జనం బతుకుదెరువు కోల్పోయారు. సంక్షేమ పథకాలు నిలిపివేయడంతో చేతిలో చిల్లి గవ్వ లేక.. పెరిగిన నిత్యావసరాలు కొనే స్థోమత లేక పండగ సంతోషాలు ఆవిరైపోయాయి. వైరల్ జ్వరాలతో పల్లెవాసులు మంచం పట్టారు. ప్రకృతి, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పంటలకు పెట్టుబడులు పెట్టడానికే రైతన్నలు తల్లడిల్లిపోతున్నారు. గడిచిన ఐదేళ్లూ పల్లెల్లో సంబరంగా చేసుకున్న సంక్రాంతి.. ఇప్పుడు కళతప్పింది. నిర్మానుష్య వాతావరణంతో పల్లెలు బోసిపోతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు

- బోసిపోయిన పల్లెలు
- కనిపించని వలస వాసుల సందడి
- పనుల్లేవు.. ఉపాధి లేదు.. చేతుల్లో డబ్బుల్లేవు
- భారీగా పెరిగిన నిత్యావసరాల ధరలు
- ప్రతి పల్లెను పీడిస్తున్న వైరల్ ఫీవర్స్
- అనుకూలించని వాతావరణంతో పంటల సాగుపై బెంగ
- రోజు వారి పనుల్లో నిమగ్నమైన పల్లె వాసులు
- 'సాక్షి' విజిట్‌లో ప్రతిబింబించిన పల్లెల పరిస్థితి

సంక్రాంతి పండగల నేపథ్యంలో పల్లె సీమలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు 'సాక్షి' బృందం ఆదివారం విజిట్ చేసింది. వింజమూరు మండలంలోని కాటేపల్లి పంచాయతీ మజరా గ్రామం తమిదపాడు. ఆ ఊరంతా సన్న, చిన్నకారు రైతు కుటుంబాలే. ఆ పల్లె ముంగిళ్లలో రంగల హరివిల్లులు కనిపించలేదు. పిండి వంటల ఘుమఘుమలు ముక్కుపుటరాలను తాకలేదు. వీధుల్లోనూ పిల్లల కేరింతలు వినిపించలేదు. వలస వెళ్లిన వారు పల్లె గూటికి చేరినట్లు లేదు. బంధుమిత్రులు వచ్చినట్లు సందడి లేదు. ఏ ఒక్కరిని కదిలించినా.. ఏం పండగయ్యా.. చేతిలో చిల్లి గవ్వలేదు.. ఏమన్నా కొనేటట్లు ఉన్నాయా? అనే ఎదురు ప్రశ్నలు. ఊర్లల్లో జ్వరాలు వచ్చి ఇంటిల్లాపాది పిల్లా.. పెద్ద అందరూ మంచం పట్టారు. పంటలు చూస్తే.. ఎన్ని మందులు వేసినా.. పైర్లు ఎదగలేదు. ప్రభుత్వం పథకాలు ఏమి ఇవ్వడం లేదంటూ.. చెప్పుకొచ్చారు. పండగ ముందు రోజు కూడా పల్లెలో సందడి లేదు. అందరూ ఎవరి పనుల్లో వారు ఉంటూ యాంత్రిక జీవనం సాగిస్తున్నారు.

తమిదపాడులో జనం మాటలివి..

సాక్షి ప్రతినిధి బృందం ఉదయం 9 గంటలకు వింజమూరు మండలం తమిదపాడు వెళ్లగా.. ఆ గ్రామంలో పండగ సందడి కనిపించలేదు. దాదాపు 250 కుటుంబాలు.. వేయి మంది వరకు జనాభా ఉన్న ఆ పల్లెలో పండగ ముందు రోజు కూడా వీధులు నిర్మానుషంగా కనిపించాయి. ఆ ఊరి జనం ఉదయమే ఇంటి పనులు ముగించుకుని పొలం పనుల బాట పట్టారు. ఉదయం 10 గంటల సమయంలో గ్రామ రామాలయం వద్ద వేప చెట్టు కింద అరుగుపై నలుగురు వృద్ధులు కుర్చోని కనిపించారు. వారితో మాటలు కలిపి ఈ ఏడు పండగ ఎలా చేస్తున్నారని ప్రస్తావించగా, ఏం పండగ అయ్యా.. ఈ ఏడాది



మందాడి రాఘవరెడ్డి

వేసిన మినుము పైరు వర్షాలతో దెబ్బతిని నష్టపోయాం. వరి కూడా వాతావరణం అనుకూలించక ఎత్తు పెరగకుండా వెన్నుదశకు వచ్చింది. పెట్టుబడులు కూడా వచ్చేటట్లు లేదు. ఏం పండగ చేసుకుంటాం. ఇంతకు ముందన్నా... ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుండేది. పంట రుణాలపై వడ్డీ రాయితీ డబ్బులు వచ్చేవి. ఈ ఏడు పెట్టుబడులు పెరిగాయి, గిట్టుబాటు ధరలు లేవు అని 68 ఏళ్ల మందాడి రాఘవరెడ్డి అనే రైతు ఆవేదనగా చెప్పుకొచ్చారు.

కనిపించని వలసవాసులు

బతుకు దెరువు కోసం తమిదపాడు నుంచి చాలా మంది ఇతర ప్రాంతాలకు పొట్ట చేతపట్టుకుని వలస వెళ్లిన వారు ఉన్నారు. సంక్రాంతి పండగ వస్తుందంటే ఎక్కడ ఉన్నా అందరూ ఊరికి చేరుకుని ఆ మూడు రోజులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా గడిపి తిరిగి ప్రయాణం అవుతారు. ఈ దఫా ఆ గ్రామంలో వలస వాసులు వచ్చినట్లు కూడా కన్పించలేదు. ఎందుకు రాలేదని అక్కడి వారిని అడిగితే.. ఈ సారి పండగపై ఎవరూ పెద్ద ఆసక్తి చూపలేదంటా చెప్పారు. వంటింటి సరుకులు ధరలు తడిసి మోపెడుతున్నాయి. ఊరికి రావాలంటే వట్టి చేతులతో రాలేము కదా. డబ్బులు లేవు. చార్జీలు ఎక్కువగా ఉన్నాయి.. పరిస్థితులు బాగాలేవు. ఈ సారిచూద్దామని రాలేకపోతున్నామని చెప్పారని చెప్పుకొచ్చారు.



తమిదపాడులో అరుగుపై పెద్దల కబుర్లు

గత ఐదేళ్లలో..

తమిదపాడులో గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి నిధులతో పల్లె పచ్చగా ఉండేది. వలంటీర్ల సేవలతో ఆ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లతో సంతోషాలు ఉండేవి. పండుగ వచ్చిందంటే చాలు ఊరంతా సందడిగా ఉండేది. పంటకు పెట్టుబడి సాయం, అమ్మఒడితో మహిళల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు రావడంతో, ప్రతి నెలా సంక్షేమ పథకాల నిధులతో ఆ పల్లెల్లో కుటుంబాలు ఆనందంగా జీవించేవారు. 2019 నుంచి 2023 సెప్టెంబర్ వరకు ఆ గ్రామానికి 22 డీబీటీ పథకాల ద్వారా 5,160 మంది లబ్ధిదారులకు రూ.14.87 కోట్లు నిధులు నేరుగా అందాయి. నాన్ డీబీటీ ద్వారా 6,823 మంది రూ.17.80 కోట్లు లబ్ధిపొందారు. చేతినిండా డబ్బులు వస్తుండడంతో ఆ కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పుడా ఆ పరిస్థితి కనిపించకపోవడంతో పండగ కళ తప్పింది.

ఊరు బయట 11:30 గంటలకు..

ఆ ఊరు బయటకు వచ్చాం.. గొర్రెలను మేతకు తోలుకెళ్తున్న 55 ఏళ్ల వెంగళరెడ్డి కనిపిస్తే.. మాట కలిపాము. సంక్రాంతి పండగ ఎలా చేస్తున్నారని.. జీవనాదాయం ఎలా ఉందని అడిగాము.. ఏముందయ్యా.. అప్పటి రోజులే మేలు. ఇప్పుడు పరిస్థితులు పండగ చేసుకునేలా ఉందా? అంటూ ప్రశ్నించారు. నేను జీవాలు మేపుకుంటూ కుటుంబం పోషిస్తున్నాను. అప్పుడు లాభాలు బాగానే ఉండేవి. మధ్యలో మోకాలు నొప్పితో రెండేళ్ల క్రితం జీవాలు అమ్మేశాను. కాస్త ఆరోగ్యం కుదుటపడ్డాక.. మళ్లీ కొని మేపుకుంటున్నాను. గొర్రెలకు కొత్త జబ్బులు వస్తున్నాయి. పశువుల ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను మందులు అడిగితే లేవు పెద్దాయనా.. మీరే కొనుక్కోవాలి అంటున్నారు.. చేతి డబ్బులు పెట్టి మందులు కొని వేసినా తగ్గడం లేదు. ఇంతకు ముందు మా జీవాలకు పశువుల ఆస్పత్రిలో ఏం కావాలన్నా.. డబ్బుల్లేకుండా వైద్యం చేసేటోళ్లు.. పాడి పంటలు బాగు ఉండేవి. అందరూ సంతోషంగా పండగ జరుపుకునేవారు. ఇప్పుడు చేతిలో డబ్బులు లేవు. పండగ చేసుకునేంత సంతోషం లేదు. అంటూ చెప్పుకొచ్చారు.

- ఆ ఊరు పరిసరాలు తిరుగుతూ కనిపించిన మరికొందరితో మాటలు కలిపితే.. ఎవర్ని కదిలిచ్చినా.. సాధక బాధలు చెప్పారు.. ఈఏడు పరిస్థితి అంతబాగా ఏం లేదయ్యా అంటూ చెప్పుకొచ్చారు. పిల్లలకు సెలవులు ఉండడంతో సమీప పొలాల్లో ఉన్న తాటి ఆకులు భోగి మంటలకు ఏరుకుంటూ కనిపించారు.



వెంగళరెడ్డి

ఏమన్నా.. కొనేటట్టు ఉన్నాయా



పండగ సరుకులు ధరలు పోయిన ఏడాదితో చూస్తే చాలా ఎక్కువగా ఉన్నాయి. గతేడాది రూ.4 వేలకు సరుకులు తెస్తే సరిపోతే, ఇప్పుడు అవే సరుకులు రూ.7 వేలయ్యాయి. దీంతో ఉన్న దాంట్లో సరి పెట్టుకున్నాం. ధరలు పెరుగుతున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు. పొయ్యి వెలిగించుకోవాలంటే భయమేస్తోంది. పండగ పూట నాలుగు పిండివంటలకు దిక్కులేదు. యాడ నుంచి వస్తాయి డబ్బులు. ప్రభుత్వం కూడా ఏ పథకం ఇయ్యడం లేదు.

– రమణమ్మ

పండగ లేదు.. పబ్బం లేదు



పైర్లు వేసేందుకు వేలు అప్పులు తెచ్చి ఖర్చు పెట్టాను. నాకు ఉన్న మూడు ఎకరాల్లో సాగు చేశాను. ఎకరానికి ఇప్పటికే రూ.30 వేలు పెట్టుబడి అయింది. ఈ ఏడాది పైరు సరిగా లేదు. కనీసం ఎకరానికి 20 బస్తాలు కూడా రావు. ధర నేల చూపు చూస్తోంది. గతేడాది పుట్టి రూ.23 వేలు ఉంటే ఇప్పుడు రూ.15 వేలు కూడా లేదు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలి అని బెంగగా ఉంది. ఇంతకు ముందు జగన్ ఉన్నప్పుడు అంతా బాగుండేది. పండగ నాటికి ఏదో పథకం డబ్బులు వచ్చేవి. ఇప్పుడాపరిస్థితి లేదు. ఏం సంక్రాంతి పండగ చేస్తాం.

– ఎం.వెంకటేశ్వర్లు

అడిగినంత ఇస్తే.. అనుమతిస్తా..

మైనింగ్ శాఖాధికారి వసూళ్ల దందా?

జిల్లాలో సైదాపురంలోని వివిధ మైన్లు నెలల తరబడి మూత పడ్డాయి. అనుమతులు ఇవ్వకుండా కూటమి నేతల నుంచి మైనింగ్ అధికారుల వరకు యజమానులకు చుక్కలు చూపిస్తున్నారు. మైన్లలో పనులు నిలిచిపోవడంతో ఆర్థికంగా దెబ్బతిని గొల్లుమంటున్న యజమానులపై మైనింగ్ శాఖాధికారి ఒకరు అవినీతి దందాకు తెర తీశారు. గతంలో నిబంధనలు ఉల్లఘించడంతో ఆయా మైన్లకు విధించిన పెనాల్టీలను అడ్డు పెట్టుకుని ఆఫర్లు, బెదిరింపులు, ఒత్తిళ్లతో యజమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే మైన్లు అన్నీ.. నెల్లూరు ఎంపీ గుప్పిట్లో ఉండగా, ఆయన ఏ మైన్‌కు అనుమతి ఇచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో సదరు అధికారి వసూళ్ల దందా సాగించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

- గతంలో విధించిన పెనాల్టీలు తగ్గిస్తామంటూ ఆఫర్లు
- సైదాపురంలోని ఐదు మైన్ల యజమానులపై ఒత్తిడి
- నెల్లూరు ఎంపీ గుప్పిట్లోనే గనులు.. ఆయన ఒప్పుకుంటేనే అనుమతులు
- ఎంపీని కాదని ఆ అధికారి ఎలా ఇస్తారని అనుమానాలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని మైనింగ్‌శాఖాధికారి ఒకరు.. సైదాపురంలోని మైకా, క్వార్ట్జ్ మైన్ల యజమానులను దోచుకునేందుకు ప్రణాళిక రచించారు. తాను అడిగినంత ఇస్తే.. మూసేసిన మైన్లకు అనుమతిస్తానంటూ ఆఫర్లు ప్రకటించారు. అధికార పార్టీ పెద్దలతో సంబంధం లేకుండా గత ప్రభుత్వం విధించిన పెనాల్టీలు తగ్గించడం, రద్దు చేయడం చేస్తానంటూ బంపర్ బొనాంజాలు ఇస్తున్నారు. లేదంటే అనుమతులు రావంటూ బెదిరింపులతో ఒత్తిడి తెస్తున్నారు. సదరు అధికారి రాయబేరాల వ్యవహారంపై మైన్ల యజమానులు అనేక అనుమానాలు వ్యక్తపరచడం కాకుండా.. ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇప్పటికే ఏడు నెలలుగా మైనింగ్ అనుమతులు నిలిపివేయడంతో ఆర్థికంగా చితికిపోయి ఉంటే.. ఇదేదంటూ మండిపడుతున్నారు.

అధికార పార్టీ నేతల గుప్పిట్లో మైనింగ్ శాఖ

జిల్లాలోని మైనింగ్‌శాఖను అధికారి పార్టీ నేతల గుప్పిట్లో ఉంది. గత ఏడు నెలలుగా సైదాపురంలోని గనుల వ్యవహారంలో ప్రజాప్రతినిధులే రెండు వర్గాలుగా చీలిపోయి రచ్చ చేస్తున్న విషయం విదితమే. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డికే ప్రభుత్వ పెద్దలు గనులు అప్పగించడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎవరు వ్యతిరేకించినా ప్రభుత్వ పెద్దలు మాత్రం ఎంపీ వైపే మొగ్గు చూపడం విశేషం. ఆయన కనుసన్నల్లోనే గనులకు లీజులు, అనుమతులు మంజూరులు జరుగుతున్నాయి. ఆ ప్రజా ప్రతినిధికి సంబంధించి మైనింగ్ వ్యవహారాలు చూసే ఓ వ్యక్తి ఏకంగా నెల్లూరులోని మైనింగ్ కార్యాలయంలోనే తిష్టవేశారు. ఆయన అక్కడే ఉంటూ అన్ని వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. ఏకంగా ఉన్నతాధికారి గదిలోనే ఉంటూ ఎవరికి అనుమతులు ఇవ్వాలి... ఎవరిని ఇబ్బంది పెట్టాలి.. ఎండీఎల్స్ (మినరల్ డీలర్ లైసెన్స్‌దారుడు) పర్మిట్లు ఇచ్చే వ్యవహారం అన్నింటిని ఆయనే దగ్గరుండి చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



నెల్లూరులోని మైనింగ్ శాఖ కార్యాలయం

గత ప్రభుత్వం పెనాల్టీలను బూచిగా చూపించి..

జిల్లా వ్యాప్తంగా ఉన్న క్వార్ట్జ్ గనుల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో గత ప్రభుత్వం దాదాపు 30 మైన్స్‌కు రూ.250 కోట్ల వరకు పెనాల్టీలు విధించింది. ఆయా పెనాల్టీలను సాకుగా చూపి మైనింగ్‌శాఖలోని కీలక అధికారి వసూళ్లకు తెర లేపాడు. రెండు రోజుల క్రితం సొంత వాహనంలో గూడూరు చేరుకుని, అక్కడి నుంచి మైనింగ్ సిండికేట్‌లో ఉన్న ఓ మైన్ యజమాని వాహనంలో సైదాపురం వెళ్లి రాయబేరాలు నెరిపినట్లు ఆరోపణలున్నాయి. పెనాల్టీలు విధించి ఉన్న క్వార్ట్జ్ మైన్స్ యజమానులతో.. మీ పెనాల్టీలు ఉంటే అనుమతులు ఇచ్చేందుకు వీలుపడదని, పెనాల్టీలు తగ్గించడం, రద్దు చేయిస్తానంటూ చెబుతూ అందుకు తనకు అడిగినంత ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇలా ఐదు మైన్స్ యజమానులతో రాయబేరాలు మాట్లాడుకోవడం.. వారిని బెదిరించిన విషయం ఇప్పుడు మైనింగ్ యజమానుల్లో చర్చ జరుగుతోంది. అసలే అనుమతులు లేక విద్యుత్ చార్జీలు కట్టుకోలేని దుస్థితిలో ఉంటే మైనింగ్ అధికారి వసూళ్ల దందా ఏమిటంటూ మండిపడుతున్నారు. ఇదంతా మైనింగ్ సిండికేట్ అండతోనే అధికారి వసూళ్లకు పాల్పడుతున్నాడంటూ ఆరోపిస్తున్నారు.

నెల్లూరు కేంద్రంగా నకిలీ సిగిరెట్ల వ్యాపారం

- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- అక్రమ వ్యాపారంపై కన్నెర్ర విజిలెన్స్
- కొనసాగుతున్న దాడులు

నెల్లూరు కేంద్రంగా నకిలీ సిగిరెట్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రముఖ బ్రాండ్లను పోలి ఉండే నకిలీ సిగిరెట్లను మార్కెట్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సిగిరెట్ లోపల ఉన్న పొగాకు నాణ్యత చూడకుండా ధూమపాన ప్రియులు ఊదేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు. లాభాలు అధికంగా ఉండడంతో చిరు వ్యాపారులు కూడా యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. అధికారుల తనిఖీల్లో పట్టుబడేది కొంత అయితే.. గుట్టుచప్పుడు కాకుండా మార్కెట్‌లో విక్రయిస్తున్న వాటి విలువ రూ.కోట్లలో ఉంటోంది.

తనిఖీ చేస్తున్న అధికారులు



నెల్లూరు (క్రైమ్): నకిలీ సిగిరెట్ల వ్యాపారం సాగించే అక్రమార్కుల చర్యలతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండిపడుతోంది. గుట్టు చప్పుడు కాకుండా సాగుతోన్న నకిలీ సిగిరెట్ల విక్రయాలు విజిలెన్స్ అధికారుల దాడుల్లో వెలుగులోకి వస్తున్నాయి. నిందితులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దిగు మతి చేసుకుని విక్రయాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని ఓ గోదాముపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి రూ.6.63 లక్షల విలువ చేసే 3,900 ప్యాకెట్ల నకిలీ సిగిరెట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున నకిలీ సిగిరెట్ల అక్రమదందా సాగుతోందని వెల్లడైంది. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్‌లు కె. నరసింహరావు, సుభాని, డీసీటీఓ విష్ణురావు నకిలీ సిగిరెట్ల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

బీడీల ముసుగులో దిగుమతి

చెన్నైకు చెందిన కమల్ తివారీ సిగిరెట్ల వ్యాపారి. అయన రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో మేనేజర్లను ఏర్పాటు చేసుకుని బిహార్‌తోపాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి నకిలీ సిగిరెట్లను దిగుమతి చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు మూడు నెలల కిందట బాలాజీనగర్‌కు చెందిన జగదీష్‌ను నెల్లూరు మేనేజర్‌గా నియమించుకున్నారు. రామలింగాపురం సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గోదాముగా ఏర్పాటు చేశారు. బిహార్ రాష్ట్రం నుంచి బీడీల పేరిట ట్యాక్స్ ఇన్వాయిస్‌లు సృష్టించి వాటి మాటున ప్రముఖ ట్రాన్స్‌పోర్టుల ద్వారా పెద్ద ఎత్తున నకిలీ సిగిరెట్లను దిగుమతి చేస్తున్నారు. వాటిని గోదాముల్లో భద్రపరచి వ్యాపారులకు వివిధ మార్గాల ద్వారా సరఫరా చేస్తూ సొమ్ము చేసుకోసాగారు. జగదీష్‌కు వ్యాపారంపై మంచి పట్టు ఉండడంతో ఎవరికి అనుమానం రాకుండా రూ.కోట్లలో విక్రయాలు సాగిస్తున్నారు. వీటితో పాటుగా డిటర్జెంట్లు, ముగ్గులు వేసేందుకు వాడే రంగులు తదితరాలను సైతం విక్రయిస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పక్కా సమాచారం అందింది. ఆదివారం నెల్లూరులోని గోదాముతో పాటు కోవూరు మండలం ఇనమడుగులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఏకకాలంలో అధికారులు దాడులు చేశారు. రూ. 2.21 కోట్ల విలువ చేసే నకిలీ సిగిరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

మూడు నెలల్లో రూ.20 కోట్లకు పైగానే..


ఆదివారం స్వాధీనం చేసుకున్న సొత్తు నాలుగైదు రోజుల కిందట దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. దీనిని బట్టి చూస్తే వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో ఇట్టే అర్థమవుతోంది. మూడు నెలల్లో సుమారు రూ.20 కోట్లకుపైగానే సిగిరెట్లు విక్రయించినట్లు తెలుస్తోంది. ఇంత పెద్ద మొత్తంలో అక్రమదందా సాగుతోండడంతో దీని వెనుక జిల్లాకు చెందిన వారు ఎవరైనా ఉన్నారా? అన్న కోణంలో సైతం అధికారులు ఆరా తీస్తున్నారు. మరో వైపు పట్టుబడిన సిగిరెట్ల శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలిస్తున్నారు.



పేర్లే వేరు, ఫోన్ నంబర్ అంతా ఒకటే (ఇన్వాయిస్)

ప్రజారోగ్యంతో చెలగాటం

నకిలీ సిగిరెట్ల తయారీదారులు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నాసిరకం పొగాకును ఉపయోగిస్తారు. వీటిలోని నికోటిన్ విషతుల్యంగా మారి ఊపిరితిత్తులు, శరీరంలోని ఇతర అవయావాలపై ప్రభావం చూపుతోంది. అసలు సిగిరెట్ తాగడమే అనారోగ్యం అంటే అందులో కల్తీ సిగిరెట్ తాగితే ఆరోగ్యం ఎంతగా దెబ్బతింటుందో ఆలోచించి ధూమపానానికి దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. నకిలీ సిగిరెట్ల విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించిది లేదని దాడులు కొనసాగిస్తామని చెప్పారు.







తొలిపొద్దు పలకరింపు

పొగమంచు దట్టంగా కమ్ముకున్న వేళ.. తొలిపొద్దు కిరణాల రాకతో ఊరు కొత్త అందాలను అద్దుకుంది. నెల్లూరులోని మైపాడు రోడ్డులో ఆదివారం తీసిన చిత్రాలు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం





ఘటన స్థలంలో మృతదేహాలు

మనుబోలు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సైదాపురం మండలం గంగదేవిపల్లికి చెందిన పాములూరు సుబ్బయ్య (36) తన స్నేహితుడితో కలిసి కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద గల ధాబాకు వెళ్లారు. తిరిగెళ్లే క్రమంలో హైవే దాటుతుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై శివ రాకేష్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తీసుకొస్తూ...



ఘటనా స్థలంలో మృతదేహం

విడవలూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని రామతీర్థం సమీపంలోని గాజులమ్మ గుడి వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఊటుకూరు కంచరపాళెం దళితవాడకు చెందిన గరికపాటి భాస్కర్ (55) అనే వ్యక్తి తన వరి పొలానికి పురుగు మందు కొనుగోలు కోసం ఆదివారం సాయంత్రం రామతీర్థం గ్రామానికి వెళ్లాడు. తిరిగొస్తుండగా రామతీర్థం శివారులోని గాజులమ్మ గుడి వద్ద గుర్తుతెలియని బొలెరో వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 120
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 218
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 240
లేయర్ చికెన్ : 145



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.39
సన్నవి : రూ.29
పండ్లు : రూ.18



గెలుపే గమ్యం

సంక్రాంతి సందర్భంగా కోవూరులో ఎడ్ల పోటీలు

- దశాబ్దాలుగా నిర్వహణ
- నేడు రైతుల సమన్వయ కమిటీ నేతృత్వంలో..



పోటీలకు ఎడ్లను సిద్ధం చేస్తూ..

కోవూరు: పల్లెసీమల్లోని రైతు కుటుంబాలకు ఎడ్లంటే మమకారం. యాంత్రీకరణతో వ్యవసాయంలో వాటి ప్రాధాన్యత తగ్గిపోయింది. యువతీ, యువకులకు ఎడ్లతో అనుబంధాలు తెలియదు. రైతు కుటుంబాల నేతృత్వంలో ఏటా సంక్రాంతి సందర్భంగా కోవూరులోని కొత్తూరు రోడ్డులో రాష్ట్ర స్థాయిలో ఎడ్ల పోటీలు నిర్వహిస్తూ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి పరిచయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పోటీలకు మన రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ ప్రాంతం నుంచి కూడా ఎడ్లను తీసుకొస్తుంటారు. దాదాపు 30 ఏళ్లుగా ఎలాంటి అపశ్రుతులు లేకుండా పోటీలను నిర్వహిస్తుండడం విశేషం. వీటిని తిలకించేందుకు యువకులు, రైతులు తరలివస్తారు.

పోషిస్తూ..

గ్రామీణ ప్రాంతాల్లో రైతు కుటుంబాలకు చెందిన కొందరు వివిధ రంగాల్లో స్థిరపడినా ఎడ్లను తమ ప్రాణంగా భావిస్తుంటారు. పోటీలకు వాటిని సిద్ధం చేసేందుకు నిత్యం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు. దీని కోసం నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేస్తుండటం విశేషం. తమ ఎడ్లకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావాలనే పట్టుదలతో వాటికి పరుగు పందేల్లో శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు.

ఐదు బహుమతులు

మూడు కిలోమీటర్ల మేర సాగే పరుగు పందెంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన ఎడ్ల జతలకు బహుమతులతోపాటు ట్రోఫీలు అందించనున్నారు. సాధారణ రైతులు నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ఇచ్చేందుకు కొందరు పోటీపడుతున్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన వారంతా తమ తల్లిదండ్రులు, పూర్వీకుల జ్ఞాపకార్థంగా వేలాది రూపాయలను బహుమతుల రూపంలో అందిస్తున్నారు. మొదటి బహుమతి కింద రూ.40 వేలు, రెండో బహుమతిగా రూ.25 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.15 వేలు, ఐదో బహుమతిగా రూ.10 వేలతోపాటు ట్రోఫీలిస్తారు.

నేడు పోటీలు

కోవూరులో సోమవారం రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయి. ఇప్పటికే 35 ఎడ్ల జతలు నమోదయ్యాయి. పోటీ లు నిర్వహించే ప్రదేశంలో ఏర్పాట్లు చేశారు.



పోటీలు జరిగే ప్రదేశం

క్రీడలపై ఆసక్తి చూపాలి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు



విజేతలతో ఇన్‌చార్జి వీసీ తదితరులు

వెంకటాచలం: విద్యార్థులు చదువుతో పాటుగా, క్రీడలపై ఆసక్తి చూపాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో జరుగుతున్న సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. కావలి జట్టు విజేతగా, వీఎస్‌యూ కళాశాల జట్టు రెండో స్థానంలో నిలిచింది. వారికి ఇన్‌చార్జి వీసీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని తెలియజేశారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. త్వరలో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరగబోయే అంతర్ విశ్వ విద్యాలయాల క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, పీడీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈఏ అసోసియేషన్ కార్యవర్గ ఏర్పాటు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఈఏలు

నెల్లూరు(పొగతోట): సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గుంజి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజశేఖర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పల్లవరం హరికృష్ణ, కోశాధికారిగా దాక్షాయణి, మరో 15 మంది కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. ఆదివారం నెల్లూరులోని యూటీఎఫ్ భవనంలో ఎన్నికల ప్రక్రియ జరగ్గా అధికారులుగా కిరణ్, సూర్యతేజ వ్యవహరించారు. 311 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కమిటీ మూడు సంవత్సరాలపాటు పదవీ కాలంలో ఉంటుంది.

ఏపీ హరిత హోటల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న బాలాజీ

నెల్లూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ నెల్లూరులోని ఏపీ హరిత హోటల్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆరునెలలుగా రూమ్ ఆక్యుపెన్సీ గురించి ఆరాతీశారు. పలు లోపాలను ఆయన గుర్తించారు. ముఖ్యంగా ఆక్యుపెన్సీ రేటు 40 శాతం కంటే తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశంగా పేర్కొన్నారు. అలాగే ఆధునికీకరణ పనులు వేగంగా జరగకోవడం, సిబ్బంది నిర్లక్ష్యం, హోటల్ నిర్వహణలో లోపాలున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది పనితీరును మెరుగుపడాలన్నారు.

బాలల ఆశ్రమానికి సేవా పురస్కారం



చెక్కును అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అల్లూరు: హిమాచల్‌ప్రదేశ్ రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎంఎస్ రావ్, డాక్టర్ షాలినీరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న పర్గాంకర్ ఫౌండేషన్ ఏటా అందజేసే ఉత్తమ సేవా పురస్కారానికి మండలంలోని నార్త్ ఆములూరులో ఉన్న బాలల ఆశ్రమం ఎంపికైంది. ఫౌండేషన్ ప్రతినిధులైన తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పీఆర్ అండ్ ఆర్‌డీ స్పెషల్ కౌన్సిల్ ఎంఎస్‌ఆర్ మూర్తితోపాటు నెల్లూరు వెంకటేశ్వర స్వామి గురు నిలయం ఆర్గనైజర్ ఎం.గోపీచంద్, ఏపీఎస్ఎఫ్‌సీ లీగల్ అడ్వైజర్ జి.మోహన్‌రావు ఆదివారం ఆశ్రమానికి విచ్చేసి చైర్మన్ రామచంద్ర శరత్‌బాబుకు పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆదరణ కరువైన పిల్లలు చెడు మార్గం పట్టకుండా వారికి మెరుగైన జీవితాన్ని అందించేందుకు ఆశ్రమం కృషి చేస్తోందని అభినందించారు. శరత్‌బాబు మాట్లాడుతూ పురస్కారం కింద అందజేసిన రూ.5 లక్షలను బాలుర పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటుకు వినియోగిస్తామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



నర్మద (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని అంజనాద్రి నగర్‌లో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పొంగూరు నర్మద (32) ఓజిలి మండలం వెందోడు గ్రామంలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త శ్రీనివాసరెడ్డి స్థానికంగా ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగిగా ఉన్నాడు. భోగి మంటలు వేసేందుకు తాటాకుల కోసం శ్రీనివాసరెడ్డి తన కుమారుడితో కలిసి స్వగ్రామమైన బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని రెడ్డిపాళెం వెళ్లాడు. అక్కడే తల్లిదండ్రులతో ఉండి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చారు. ఎంతసేపటికీ నర్మద తలుపులు తీయకపోవడంతో బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని తండ్రీకొడుకులు భావించి గేటు వద్దే కూర్చొన్నారు. కాగా నర్మదకు ఫోన్ చేసినా స్పందన లేదు. ఈ సమయంలో పక్కింటి వారు వివాహానికి వెళ్లి తిరిగి రాగా వారితో నర్మద ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని శ్రీనివాసరెడ్డి చెప్పాడు. అందరూ కలిసి బెడ్ రూమ్‌కి వెనుక వైపునున్న కిటికీ వద్దకు వెళ్లి అద్దాలు పగులగొట్టి చూడగా ఆమె ఉరేసుకుని ఉంది. వెంటనే పోలీసులకు తెలియజేయడంతో సీఐ శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. లోపలికి వెళ్లి చూసి అప్పటికే ఆమె మృతిచెందినట్లు గుర్తించారు. నర్మద తల్లిదండ్రులు చనిపోగా ఆమె, తమ్ముడిని నానమ్మ పెంచినట్లు తెలిసింది. నర్మద ఇటీవల తన కుమారుడి పదో సంవత్సరం పుట్టినరోజును వేడుకగా చేసినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.